# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

## కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలే..



నర్మెట, నవంబర్ 20: సీఎం కేసీఆర్ సార్ వ్యవసాయానికి ఉచితంగా 24 గంటలు కరెంట్ ఇస్తుండు. దీంతో పంటలను మంచిగ పండించుకుంటున్నం. కానీ కాంగ్రెస్ నాయకులు మూడు గంటల కరెంట్ ఇస్తే సరిపోతుందంటున్నరు. ఇట్లయితే ఎకరం పొలం కూడా పారదు. బోరులో 10 హెచ్‌పీ మోటారు వేస్తే నీళ్లు సరిగా రావు. బోరుకు ఉండే ఊటలు తగ్గి నీళ్లు అయిపోయి మోటార్లు కాలిపోతయి. మా దగ్గర బోర్లు 300 పీట్లు వేయాల్సి వస్తుంది. అంత లోపల 10 హెచ్‌పీ మోటారు వేస్తే కాలిపోయినప్పుడల్లా బయటకు తీయడం సాధ్యం అయ్యే పనికాదు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నరు. వ్యవసాయానికి మూడు గంటలు మాత్రమే కరెంట్ ఇస్తామంటే సరిపోదు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లేస్తే కష్టాలు కొనితెచ్చుకున్నట్లే. రైతులను రాజు చేస్తున్నది కేసీఆర్ సార్. మేమంతా బీఆర్ఎస్ పార్టీకే ఓట్లేస్తం. కేసీఆర్ సార్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తం.

– ప్రజ్ఞాపురం శ్రీనివాస్, రైతు, నర్మెట

## 3 గంటల కరెంటుతో పొలం పారుతదా..



బచ్చన్నపేట, నవంబర్ 20 : సీఎం కేసీఆర్ సార్ అధికారంలోకి వచ్చాక కరెంటు పుల్‌గా వస్తున్నది. దీంతో వ్యవసాయం బాగుపడ్డది. పంట పొలాలకు నీళ్లు మంచిగ పారుతున్నయ్. ఉచితంగా కరెంటు ఇస్తుండడంతో బిల్లులు కట్టాల్సిన అవసరం లేదు. కానీ కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తే 3 గంటల కరెంటు అంటున్నర్. ఇట్లయితే వ్యవసాయం పడావుపడుతది. 24 గంటల కరెంటే కావాలి. కాంగ్రెస్ నాయకులు రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నరు. కాంగ్రెస్‌కు ఓటేస్తే నిండా మునుగుడె. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని అందరూ ఆలోచన చేయాలి. ఇప్పుడు 5 హెచ్‌పీ మోటర్లు వాడుతున్నం. 10 హెచ్‌పీ మోటర్లు ఎవ్వరూ కొనరు. కాంగ్రెస్ నాయకుల మాటలు రైతులు నమ్మొద్దు. వాళ్ల మాటలు వింటే మళ్లా పదేళ్ల కింద పడిన ఇబ్బందులు తప్పవు. కేసీఆర్ సార్ ఇస్తున్న కరంట్ బాగుంది. మళ్లీ ఈసారి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకే మా మద్దతు ఉంటుంది.

–గన్నె బీరప్ప, రైతు, చిన్నరామన్‌చర్ల, బచ్చన్నపేట మండలం

## కేసీఆర్ పాలనలో రైతే రాజు..



స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 20 : నేను 30 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నా. పదేళ్ల క్రితం వ్యవసాయానికి సరిగా కరెంటు రాలేదు. లోవోల్టేజీతో మోటర్లు కాలిపోయి పంటలు ఎండిపోయి. పెట్టిన పెట్టుబడులు రాక, అప్పుల పాలై నానా ఇబ్బందులుపడ్డం. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ పుణ్యమా అని నిరంతర కరెంటు వస్తున్నది. సాగునీటితో కష్టాలు తప్పి ఇప్పుడిప్పుడే మా జీవితాల్లో వెలుగు నిండుతున్నాయి. కానీ కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలు.. 10 హెచ్‌పీ మోటర్ వాడితే సరిపోతుందంటున్నడు. రేవంత్‌రెడ్డిని నమ్ముకుంటే రైతులు మూడుచెర్ల నీళ్లు తాగాలి. 5 హెచ్‌పీ మోటర్‌తో ఎకరం పొలం ఐదు గంటల్లో పారుతుంది. నీళ్లు కూడా భూమిలోకి ఎక్కువగా ఇంకడవల్ల పంటలు బతుకుతాయి. పొగాకు, మక్కజొన్న పంటలకు నీళ్లు ఎక్కువ అవసరం. అదే 10 హెచ్‌పీ మోటర్ వాడితే బావులు, బోర్లలో నీళ్లు తొందరగా అయిపోతయి. పంటలు ఎండిపోతయి. 10 హెపీ మోటర్ అయితే 200 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ అవసరం ఉంటుంది. సుమారుగా 8 యూనిట్ల కరెంట్ కాలుతుంది. మూడు గంటల కరెంటు, 10 హెచ్‌పీ మోటార్‌తో రైతులు వ్యవసాయం చేసుకోలేక మూట ముళ్లె సదురుకుని దేశాలపంటి పోవాలె. రైతులంతా కేసీఆర్ సార్‌కే మద్దతు.

– మంద రాజు, రైతు, ఇప్పగూడెం



పెంబర్తి శివారులోని పొలంలో రైతు బండ రాములు

## రేవంత్ మాటలు నమ్మితే మునుగుడె..

**బండ రాములు, రైతు, పెంబర్తి**

జనగామ రూరల్, నవంబర్ 20: నాకున్న మూడెకరాలకు నీళ్లు పారించేందుకు 7.7 హెచ్‌పీ మోటర్ వాడుతున్న. దీంతో భూమి నుంచి నీళ్లను మొత్తం తీడేస్తుండడంతో తొందరంగా అయిపోతున్నవి. చివరి పొలం వరకు నీరందుతలేదు. వ్యవసాయ బావులకు 10 హెచ్‌పీ మోటర్లు వాడాలని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నరు. అది సాధ్యం కాదు. వీటిని ఏ రైతు కూడా ఉపయోగించరు. 10 హెచ్‌పీ మోటర్ వాడితే బావిలోని నీళ్లన్నీ తొందరగా అయిపోతయి. అది కాలిపోతే మరింత ఖర్చు భరించాలి. రేవంత్‌రెడ్డికి వ్యవసాయం మీద అనుభవం లేదు. చిన్న, సన్నకారు రైతులు 10 హెచ్‌పీ మోటర్లు వాడలేరని తెలుసుకోవాలి. సీఎం కేసీఆర్ ఇప్పుడు ఇస్తున్న కరంట్ చాలు. కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతులు ఆగమైతరు. 3 గంటల కరంట్ ఇస్తే మొదటి మడి కూడా పారదు. మేమైతే సీఎం కేసీఆర్ సార్‌కే మద్దతు చెబుతున్నం.

## మోటర్ల కెపాసిటీ పెంచితే రైతులకు నష్టమే..



స్టేషన్‌ఘన్‌పూర్, నవంబర్ 20 : వ్యవసాయంపై అవగాహన లేని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి వచ్చిరాని మాటలు చెబుతున్నడు. 3 గంటలు కరెంట్ ఇస్తే చాలని చెప్పడం సరైంది కాదు. ఇలా చేస్తే పంటలకు నీళ్లు పెట్టలేం. 10 హెచ్‌పీ మోటర్లతో నష్టమే తప్ప ఉపయోగం లేదు. ఒక్కో రైతు వ్యవసాయ భూమిలో 300 ఫీట్ల వరకు బోరు బావి ఉంది. వీటిలో 10 హెచ్‌పీ మోటార్ ఏర్పాటు చేసుకోవాలనుకుంటే రూ.70 వేల ఖర్చవుతయి. రూ.60 వేలు పైపులకు, రూ.15 వేలు వైరుకు, ఇతర సామానుకు రూ.10 వేల వరకు ఖర్చ చేయాలి. 5 హెచ్‌పీ మోటర్ కాలిపోతే రిపేరుకు రూ.3 వేల వరకు ఖర్చవుతుంది, 10 హెచ్‌పీ మోటర్‌కైతే రూ.15 వేల వరకు అవసరం. దీనిని వాడాలంటే 600 నుంచి 800 ఫీట్ల వరకు బోరు రంధ్రం ఉండాలి. ఇంతకంటే తక్కువ ఉంటే నీళ్లు తొందరగా అయిపోయి మోటర్లు దెబ్బతింటయ్. ఓవర్ లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే ప్రమాదం ఉంది. బావుల్లో, బోరు బావుల్లో నీళ్లు తొందరగా అయిపోయి పంటలకు నీరందదు. ఇప్పుడు వ్యవసాయానికి లోవోల్టేజీ లేకుం కరెంట్ మంచిగ వస్తున్నది. దీంతో మోటార్లు కాలిపోవడం లేదు. వ్యవసాయంపై అవగాహన లేకనే రేవంత్‌రెడ్డి కరెంటు గురించి ఇలా మాట్లాడుతున్నడు.

–బొమ్మగళ్ల కుమారస్వామి, బోరు మెకానిక్, స్టేషన్‌ఘన్‌పూర్

## 10 హెచ్‌పీ మోటర్లు మనకు పనికిరావు

- వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోదు
- ఆటో స్టార్టర్లు తొలగించాలి
- పెరుమాళ్ల సత్యనారాయణ గౌడ్, రిటైర్డ్ సీఈ, ఎన్పీడీసీఎల్, వరంగల్



దేవరుప్పుల, నవంబర్ 20: తెలంగాణలోని నీటి వసతులు, భూస్వరూపాలు, బోర్ల లోతును బట్టి వ్యవసాయానికి 10 హార్స్‌పవర్ విద్యుత్ మోటార్లు అవసరం లేదు. ఇప్పుడు రైతులు వాడుతున్న 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటార్లు అనుకూలంగా ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10 హెచ్‌పీ విద్యుత్ పంపుసెట్లను రైతులు నడుపుతున్న దాఖలాలు లేవు. దేవరుప్పుల ప్రాంతంలో గతంలో సాగునీటి సమస్య ఉండేది. బోర్లు చాలా లోతు వరకు వేస్తే 5 హెచ్‌పీ మోటర్లు సరిపోయేది, నేడు నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. సాగునీటి వనరులు పెరిగాయి. భూమిపై పొరల్లోనే నీరుంది. దీంతో 3,5 హెచ్‌పీ మోటర్లు సరిపోతాయి. కాంగ్రెస్ నాయకులు చెబుతున్నట్లు 10 హెచ్‌పీ మోటర్లు అవసరం లేదు.

**నాణ్యమైన కరెంటు సరఫరా అవుతుంది.**

ప్రస్తుతం నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతున్నది. కొత్త సబ్‌స్టేషన్లు, కొత్త లైన్లు, అవసరాన్ని బట్టి ట్రాన్స్‌ఫార్మర్లు పెంచారు. అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ పెంచారు. 24 సరఫరా అవుతున్నా ఇబ్బందులు లేకుండా నాణ్యమైన సరఫరా ఉంది. లైన్ లాస్, ట్రిప్పింగ్‌లు లేవు.

**3 గంటల విద్యుత్ కరెక్ట్ కాదు..**

తెలంగాణ రైతులకు మూడు గంటల విద్యుత్ చాలన్న అంశం అసమంజసం. తెలంగాణలో నీటి వనరులు పెరగడంతో సాగు విస్తీర్ణం పెరిగింది. రైతులు తమకున్న పూర్తి భూమిని సాగుకు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఇస్తున్న తరహాలోనే విద్యుత్ సరఫరా ఉండాలి. మూడు గంటల విద్యుత్ సరఫరా ఆమోదయోగ్యం కాదు. భూమిలో అందుబాటులో ఉన్న నీటి నిలువలు, భూస్వభావాన్ని బట్టి నీటి వినియోగం ఉంటుంది. వరి సాగుకు నీటి అవసరం ఎక్కువ. తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం ఎక్కువ. మూడు గంటల విద్యుత్ వ్యవసాయానికి ఎలా సరిపోతుంది. 10 హెచ్‌పీ మోటార్లు బిగిస్తే ఇప్పుడున్న విద్యుత్ సరఫరా వ్యవస్థ చాలదు.

## కాంగ్రెస్‌తో రైతులకు కాలరాత్రులే..



వేలేరు, నవంబర్ 20 : రైతులకు మూడు గంటలే కరెంట్ సరిపోతుందన్న కాంగ్రెస్ పార్టీతో రైతులకు కాలరాత్రులే. వారికి ఓటేస్తే రైతులకు మళ్లీ పాత రోజులు వస్తాయి. చీకట్లో నిద్రహారాలు మాని వ్యవసాయ బావుల వద్ద పడిగాపులు పడాల్సి వస్తది. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న 24 గంటల కరెంట్‌తో రైతుల జీవితాల్లో ఇప్పుడిప్పుడే వెలుగులు కన్పిస్తున్నాయి. కాంగ్రెస్‌ను నమ్మితే రైతులకు మళ్లీ చీమ్మ చీకట్లే.. మూడు గంటల కరెంట్‌తో రైతులకు కనీసం 20 గుంటల భూమి కూడా తడవదు. కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోతలతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. మళ్లీ ఆ పాత రోజులు వస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారు. రైతులకు మంచి రోజులు ఉండాలంటే మళ్ళీ తెలంగాణ ప్రభుత్వమే రావాలి

– కొయ్యడ అశోక్, వేలేరు

## 'ధరణి 'ని రద్దు చేస్తే దళారులొస్తరు..



ఒక్క రోజులోనే భూమి రిజిస్ట్రేషన్ మార్పిడితో రైతులకు మేలు చేస్తున్న ధరణిని రద్దు చేస్తే మళ్లీ దళారుల వ్యవస్థ ఏర్పడుతుంది. భూ రికార్డుల్లో మళీ పూర్వ వివరాలు పెట్టి ధరణిని రద్దు చేస్తామని చెబుతున్న కాంగ్రెస్‌కు రైతులే తగిన బుద్ధి చెబుతారు. ధరణి రద్దు చేస్తే భూమి రిజిస్ట్రేషన్‌లలో చాలా అవకతవకలు జరుగుతాయి. రైతులు అధికారుల చుట్టూ తిరాగాల్సి వస్తుంది. రిజిస్ట్రేషన్ కావాలంటే రెండు, మూడు నెలలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాలె. తెలంగాణ సర్కారు అమలు చేస్తున్న ధరణిని కొనసాగించాల్సిందే.

– కొయ్యడ వెంకటస్వామి, వేలేరు

## కాంగ్రెస్‌కు ఓటేస్తే మోసపోతం..



కొడకండ్ల, నవంబర్ 20 : తెలంగాణ రాక మునుపు మోటర్లు పెట్టటడానికి చీకట్ల పోయినప్పుడు పాములు, తేళ్లు కుట్టేవి. కరెంట్ రాక అరిగోస పడ్డం. తెలంగాణ రాష్ట్రం వచ్చాక సీఎం కేసీఆర్ సార్ వ్యవసాయానికి 24 గంటలు కరంట్ ఇస్తున్నరు. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు వారు అధికారంలోకి వస్తే మూడు గంటలు కరంట్ ఇస్తరట. ఇది సరిపోతుందా. కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట మునిగినట్లే.

– లకిడి ఉపేందర్, నర్సింగపురం